వామ్మో ఇన్ని ఇండ్లా..!

హైదరాబాద్ వార్త

-సజావుగా సాగని గృహ గణన
-గగ్గోలు పెడుతున్న ఎన్యుమరేటర్లు
-ఒకొక్కరికీ 200నుంచి 300కేటాయింపు
-నెంబర్లు వేసేసమయంలో వేలల్లో ఇండ్ల లెక్కలు
-ఎండలకు తిరగలేకపోతున్నామని ఆవేదన

హైదరాబాద్,మే 16,ప్రభాతవార్త: కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న నివాసాలను హౌజ్ లిస్టింగ్ చేసేందుకు సుమారు 25 వేల 177 మంది ఎన్యుమరేటర్లను, ప్రతి ఎనిమిది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ను, వార్డుతో నోడల్ ఆఫీసర్ ను నియమించిన సంగతి తెల్సిందే. ఒక్కో ఎన్యుమరేటర్ కు సుమారు 250 నుంచి 300 గృహాలను కేటాయించిన అధికారులు తొలుత తమకు కేటాయించిన ఇండ్లకు ఓ నెంబర్ ను కేటాయించాలని సూచించారు. సెన్సెస్ ప్రక్రియ పక్కాగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ఎన్యుమరేటర్లలో ఎక్కువ మందిని విద్యాశాఖకు చెందిన టీచర్లను నియమించటంతో పాటు వారికి కేటాయించిన ఏరియాతో వారికెలాంటి సంబంధం లేకుండా నాన్ లోకల్ టీచర్లకు ఈ బాధ్యతలను అప్పగించారు. కానీ ఎన్యుమరేటర్లకు కేటాయించిన 250 నుంచి 300 ఇళ్లకు ఒకటి నుంచి 250 గానీ, 300 వరకు సీరియల్ నెంబర్లు వేసుకునేందుకు ఫీల్డుకు వెళ్లిన ఎన్యుమరేటర్లకు కేటాయించిన ఇళ్ల సంఖ్య ఒక్కసారిగా మూడు నుంచి నాలుగు రేట్లు పెరిగాయి. ఈ ఇళ్ల సంఖ్యను కేటాయించిన సెన్సెస్ ప్రిన్సిపల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ జీహెచ్ఎంసీలో అందుబాటులో ఉన్న ఇంటి నెంబర్ల ప్రకారం, ఇంటి యజమాని చెల్లించి ప్రాపర్టీ ట్యాక్స్ ఇండెక్స్ నెంబర్ (పీటీఐఎన్)ల ద్వారా ఇళ్ల సంఖ్యను 250 నుంచి 300 మధ్య కేటాయించారు. కానీ హౌజ్ లిస్టింగ్ కోసం నేరుగా వెళ్లిన ఎన్యుమరేటర్లకు ఒక్క ఇంటి నెంబర్ తో ఏకంగా మూడు నాలుగు అంతస్తుల భవనాలున్నాయి. వాటిల్లో దాదాపు ఆరు నుంచి ఎనిమిది కుటుంబాలు నివసిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. అధికారులు అప్పగించిన బాధ్యత ప్రకారం అది ఒకే ఇల్లు అని, వాటిలో ఒకే కుటుంబం నివాసముంటున్నట్లు ఎన్యుమరేటర్లు భావిస్తున్నారు. ఇళ్లను కేటాయించే సమయంలో అధికారులు 250 నుంచి 300 మధ్య ఇళ్లను కేటాయిస్తూ, వీటన్నింటికీ హౌజ్ లిస్టింగ్ చేసుకునేందుకు వచ్చే నెల 9వ తేదీ వరకు గడువు విధించారు. కానీ ఎన్యుమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లిన తర్వాత ఒక్కో ఇంటి నెంబర్, ఒక్కో ప్రాపర్టీ ట్యాక్స్ ఇండెక్స్ నెంబర్ పై ఒకటి కాకుండా కొన్ని భవనాల్లో మూడు నుంచి నాలుగు, మరి కొన్నింటిలో నాలుగు నుంచి ఆరు కుటుంబాలు నివసిస్తున్నందున, కుటుంబాల వారీగా హౌజ్ లిస్టింగ్ చేయాల్సి వస్తుందని కొందరు ఎన్యుమరేటర్లు వాపోతున్నారు.

ఆవివరాలు మేం ఎందుకు చెప్పాలి ..?

హౌజ్ లిస్టింగ్ చేసే సమయంలో ఒక ఇంటికి ఒక సీరియల్ నెంబర్ ను కేటాయించిన తర్వాత సేకరించాల్సిన సమాచారం కోసం ఉన్నతాధికారులు మొత్తం 33 ప్రశ్నలను ఎంపిక చేసి, వాటిని ఎన్యుమరేటర్లకు అప్పగించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో కొందరు ఎన్యుమరేటర్లు 33 ప్రశ్నలే కాకుండా, ఇంట్లో ఎన్ని గదులు అద్దెకిచ్చారు. నెలకు ఎంత కిరాయి వస్తుందన్న ప్రశ్నలు సంధించటంతో సమాచారమిచ్చేందుకు కుటుంబ యజమానులు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిసింది.

గతంలో గులాబీ సర్కారు హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో కూడా ఇదే తరహాలో ఇల్లు ఏ మెటీరియల్‌తో నిర్మించారు. మొత్తం ఏరియా ఎం? ఎన్ని అంతస్తులు నిర్మించారు? ఇంట్లో టీవీ, ఫ్రిడ్జ్, ఏసీ వంటి ఉన్నాయా? కుటుంబ యజమానిపై పేరుపై బైక్ గానీ, కారు గానీ ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో సమాచారం సేకరించారు. ఆ తర్వాత కొంత మంది తెల్ల రేషన్ కార్డులు, మరి కొందరి పెన్షన్లు రద్దయ్యాయి. ఇపుడు కూడా దాదాపు అదే పరిస్థితి నెలకొంది. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియలో ఎన్యుమరేటర్లకు 33 ప్రశ్నలు ఇచ్చినప్పటికీ, ప్రధానంగా ఇంటి యజమాని సెల్ ఫోన్ నెంబర్, ఆ ఇంట్లో ఎంత మంది నివాసముంటున్నారన్న అంకెను మాత్రమే సేకరించనున్నట్లు కొద్దిరోజుల క్రితం కోర్ అర్బన్ రీజియన్ సెన్సెస్ ప్రిన్సిపల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. తిరిగి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో ఇపుడు చేపట్టిన హౌజ్ లిస్టింగ్ ప్రకారం ప్రతి కుటుంబంలోని సభ్యులందరి పూర్తి వివరాలు సేకరించనున్నట్లు కూడా కమిషనర్ వెల్లడించినా, క్షేత్ర స్థాయిలో హౌజ్ లిస్టింగ్ 33 ప్రశ్నలకు అదనంగా ప్రశ్నలు జోడించి మరో రకంగా జరుగుతున్నట్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కుటుంబ యజమానులు పారదర్శకంగా సమాచారమివ్వటం లేదని తెల్సింది.

ఉప్పల్ చౌరస్తాలో నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

-ప్రారంభమైన కారిడార్ పిల్లర్ పనులు
-నల్ల చెరువు వద్ద బస్టాప్

ఎంఎంసి అధికారులు విడుదల చేసిన ట్రాఫిక్ మళ్లింపు చిత్రం దృశ్యం.

ఉప్పల్, మే 16 ప్రభాతవార్త : ఉప్పల్ చౌరస్తాలో ఆదివారం నుంచి ట్రాఫిక్ దారిమళ్లింపు చేపడుతున్నామని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పిల్లర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉప్పల్ లీలీది కార్యాలయం పక్కన ఉన్న వరంగల్, హనుమకొండ మరియు యాదగిరిగుట్ట బస్సుల స్టాప్‌ను తాత్కాలికంగా నల్ల చెరువు కట్ట వద్దకు మార్చినట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట వైపు వెళ్లే ప్రయాణికులందరూ నల్ల చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వరంగల్ బస్ స్టాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం నుండి ఉప్పల్ రింగ్ రోడ్ లోని వరంగల్ వైపు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేస్తామని తెలిపారు. దీని ట్రాఫిక్ మళ్లింపులు ఉండే అవకాశమున్నందున, వాహనదారులు మరియు ప్రయాణికులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని ప్రయాణించాలని కోరారు. వరంగల్ నుండి హైదరాబాద్ వెళ్లే వాహనదారులు మేఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ ద్వారా నాగోల్ వెళ్లి, సర్వీస్ రోడ్డు ద్వారా వెళ్లి ఫ్లైఓవర్ కింద యూ టర్న్ తీసుకొని హైదరాబాద్ వెళ్లాలని కోరారు. హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనదారులు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్క నుండి బీరప్ప గడ్డ మీదుగా వెళ్లి జాతీయ రహదారి 163 మీదుగా వరంగల్‌కు వెళ్లాలని కోరారు. ఉప్పల్ భగాయత్ రోడ్డు చాలా చిన్నగా ఉన్నందున హైదరాబాద్, వరంగల్ బస్సులు, లారీలు ఒఆర్ఆర్ మీదుగా ప్రయాణించాలని సూచించారు. హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనదారులు ఎల్బీ నగర్,హయత్‌నగర్ ఒఆర్ఆర్ మీదుగా ఘట్కే సర్ నుండి వరంగల్ వెళ్లాలని కోరారు. ప్రజలు ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా పోలీసు శాఖ, సంబంధిత అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

23నుండి జయశంకర్ వర్సిటీ విత్తన వారోత్సవాలు ప్రారంభం

- లక్షా యాభై వేల మంది రైతులకు నాణ్యమైన విత్తనాలు
- 18 నుండి రైతులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాలి
: ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య

అత్తాపూర్ మే16 ,ప్రభాతవార్త : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నెల 23 నుండి 30 వరకు "విత్తన వారోత్స వాలు" నిర్వహిస్తూ వివిధ జిల్లాలలో వివిధ పంటలకు సంబంధించిన రకాల నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. శనివారం ఉపకులపతి అల్దాస్ జానయ్య ఓ ప్రకటనలో మాట్లాడుతూ....ఈ విత్తన వారోత్సవాలలో భాగంగా అన్ని పంటలకు సంబంధించిన సుమారు 1,231 టన్నుల విత్తనాలను రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,50,000 మంది రైతులకు 27 యూనివర్సిటి అమ్మక కేంద్రాలలో అమ్మకానికి సిద్ధంగా ఉంచామని ఆయన తెలిపారు. మొత్తం రాష్ట్రంలోని విత్తన అవసరాలలో ఇది కేవలం ఒక శాతం అయినప్పటికీ విశ్వవిద్యాలయం ఇస్తున్న మూల విత్తనం ద్వారా వచ్చే దిగుబడిని తిరిగి వచ్చే మూడు సంవత్సరాలు విత్తనంగా వాడుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం మార్కెట్లో కొన్ని నకిలి విత్తన కంపెనీలు రైతాంగానికి పదేపదే మోసం చేస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం నాణ్యమైన విత్తనోత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి ప్రతి గ్రామాన్ని విత్తనం స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ప్రతి రైతుకు ఆయా పంటకు సంబంధించి రెండు మూల విత్తన కిట్లు (2 ఎకరాలకు సరిపోయే విత్తనం) మాత్రమే అమ్మబడతాయని, విశ్వవిద్యాలయంలో ఉన్న మూల విత్తనం పరిమితమైన పరిమాణంలో ఉన్నందున ఈనెల 18నుండి 22 వరకు పట్టిక 3లో తెలిపిన ప్రకారం ఆయా జిల్లాల రైతాంగం విశ్వవిద్యాలయకు సంబంధించిన సంబంధిత అమ్మక కేంద్రాలలో అడ్వాన్స్ బుకింగ్ చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి విజ్ఞప్తి చేశారు. ఆయా అమ్మక కేంద్రాలకు సంబంధించిన శాస్త్రవేత్తల పేర్లు మరియు వారి ఫోన్ నెంబర్లు పట్టిక 3లో పొందుపరచడం జరిగిందని, పరిమిత పరిమాణంలో విత్తనాలు అందుబాటులో ఉన్నందున అడ్వాన్స్ బుకింగ్ చేసుకొన్న రైతాంగానికి పంపిణీ చేయగా మిగిలిన విత్తనాన్ని ఆయా కేంద్రాలలో మే 23 నుండి ఇతర రైతులు కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతు సంబంధిత అమ్మక కేంద్రాల నుండి విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విశ్వవిద్యాలయ అధికారిక రశీదుతో పాటు సంబంధిత సాంకేతిక పత్రాన్ని విధిగా ఆయా శాస్త్రవేత్తల నుండి పొందాలని కోరారు.

100 శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

-ఎస్ఎఫ్ఎలతో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష -పరిశుభ్రత, చెత్త నిర్వహణపై కీలక ఆదేశాలు

సిబ్బందికి సూచనలు చేస్తున్న కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త : నగర పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఫీల్డ్ స్థాయి పనితీరుపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి జోనల్ కార్యాలయంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ సమక్షంలో ఎస్ఎఫ్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సాట్ ఆటోల ద్వారా 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి మిగిలిన గ్యాప్‌లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల అంచులు, మిడియన్లు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక స్వీపింగ్ చర్యలు చేపట్టాలని, నిర్మాణ వ్యర్థాలను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. స్వీపర్ల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అంతకుముందు కమిషనర్ మోలాలి సంజయ్ గాంధీనగర్, మహేంద్రహిల్స్, ఇందిరా నెహ్రూనగర్, ఆనంద్‌బాగ్, తుకారాంగేట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. దోమల లార్వా పెరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, ఫాగింగ్, యాంటీ లార్వల్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మహేంద్ర హిల్స్, ఇందిరా నెహ్రూనగర్ ప్రాంతాల్లో కొండ ప్రాంతాల కారణంగా సాట్ ఆటోలు కొన్ని ప్రాంతాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించిన కమిషనర్, ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్త సేకరణ జరిగేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని, నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సూచించారు.

డివైడర్ ఢీకొని యువకుడు మృతి

తుర్కయంజాల్ మే16 ప్రభాతవార్త : ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలో ఈ ఘటన శనివారం తెల్లవారుజామున ఆదిభట్ల పీఎస్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ మన్నెగూడకు చెందిన గుర్రం జగదీశ్వర్ రెడ్డి(35) అనే యువకుడు పెట్రోల్ కోసం తుర్కయాంజాల్ కు వెళ్లాడు. అక్కడి నుంచి ఓ యువకుడ్ని లిఫ్ట్ అడిగి మన్నెగూడకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గంమధ్యలో సాగర్ రహదారిపై మన్నెగూడ వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జగదీశ్వర్రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా..మరో యువకుడు బైకు నడిపిన దీక్షిత్ రెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి గమనించిన స్థానికులు క్షతగాత్రుడ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు

మీ సురక్షతో గృహ సహాయకుల ధృవీకరణ

-మల్కాజిగిరి కమిషనరేట్‌లో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం

మల్కాజిగిరి, కమిషనరేట్ మే 16,ప్రభాతవార్త

నగర పరిధిలో పెరుగుతున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, మారుతున్న నేర ధోరణులను దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ మీ సురక్ష" పేరుతో ప్రత్యేక కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గృహ సహాయకులు, డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్లు తదితర సిబ్బంది వివరాల నమోదు, ధృవీకరణ ఈ కార్యక్రమం ద్వారా చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు.శనివారం నుంచి కమిషనరేట్ పరిధిలోని 28 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 550 కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, నివాస ప్రాంతాల్లో ఒకేసారి పోలీసులు తనిఖీలు చేపడుతున్నారని వెల్లడించారు.ఇళ్లలో పనిచేసే పనిమనుషులు, వంటమనుషులు, డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు, గార్డెనర్లు, కేర్‌టేకర్ల వివరాలను సేకరించి డిజిటల్ విధానంలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం హాక్ఐ అల్ట్రా యాప్‌తో పాటు గూగుల్ ఆధారిత ఆన్‌లైన్ ఫారమ్‌లను వినియోగిస్తున్నట్లు చెప్పారు.నివాసుల సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, వాలంటీర్లు, కాలనీ ప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు, సీనియర్ సిటిజన్లు, మహిళలు, పిల్లల భద్రతకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని, హాక్ఐ అల్ట్రా యాప్ లేదా గూగుల్ లింక్ ద్వారా వివరాలు నమోదు చేయాలని కమిషనర్ బి. సుమతి విజ్ఞప్తి చేశారు.

మెట్రో పోలీస్ హోటల్‌లో అగ్నిప్రమాదం

-67 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన అగ్నిమాపక సిబ్బంది

సికింద్రాబాద్ మెట్రో పోలీస్ హోటల్‌లో అగ్నిప్రమాదం

కంటోన్మెంట్,మే 16 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని మెట్రో పోలీస్ హోటల్‌లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. హోటల్‌లోని 3వ అంతస్థులో ఉన్న వంట గదిలో షాట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయి. దాని పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోకి మంటలు వ్యాపించడంతో అగ్నిప్రమాదం తీవ్రమైంది. ఈ హోటల్‌లో బస చేస్తున్న 67 మంది అగ్ని నప్రమాద ఘటనతో భయాందోళనకు గురైయ్యారు. వారిని హైడ్రాలిక్ ఫ్లాట్ ఫామ్ వెకిల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా వారిని సురక్షితంగా కాపాడినట్లు అగిమాపక అధికారులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.షాట్ సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం...ఏజన్సీపై జరిమానా

యాకుత్‌పుర,మే 16 ప్రభాతవార్త : పాతబస్తీలో పారిశుధ్య నిర్వాహణ పని తీరుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎక్సోరాఏజన్సీపై జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.చార్మినార్‌జోనల్ కమిషనర్ సత్యనారాయణ శనివారం చార్మినార్,మక్కామసీదు, పరిసర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య నిర్వాహణపై ఆరా తీశారు.కొన్ని ప్రాంతాలలో పారిశుద్ధ్యం సరిగ్గా లేకపోవడం, చెత్త పేరుకుపోవటం గ్రహించినజోన్ కమిషనర్ సత్యనారాయణ ఎక్సోరా ఏజన్సీపై ఆగ్రహం వ్యక్తం చేసి ఏజన్సీపై 20 వేల రూపాయలు జరిమానా విధించారు.కాగా ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్,వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులతో కలిసి ఆయన పాతబస్తీ శాలిబండ ఆషా టాకీస్ వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించారు.పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు.అనంతరం వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ డిఎంసి సరిత,జలమండలి డైరెక్టర్ వినోద్ భార్గవ్,మేనేజర్లు,ఎస్ఈ ఇందిరా దేవి,డిఈ శ్రీ రాములు పాల్గొన్నారు.

పటాన్‌చెరు హత్య కేసును చేధించిన పోలీసులు

అక్రమ సంబంధమే హత్యకు కారణం- ఇద్దరు నిందితుల అరెస్టు

సమావేశంలో హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్ తదితరులు

గచ్చిబౌలి, మే 16 ప్రభాతవార్త

సంచలనం సృష్టించిన పటాన్ చెరు హత్య కేసును సైబరాబాద్ పోలీసులు చేధించారు. అక్రమ సంబంధమే హత్యకు కారణమని తేల్చిన పోలీసులు మృతుడి భార్యతో పాటు స్నేహితున్ని అరెస్టు చేశారు. పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు...పటాన్ చెరు చైతన్య నగర్‌కు చెందిన బైండ్ల నవీన్(24) పటాన్ చెరులోని వాల్యూజోన్ పక్కనే ఓ చిన్న హోటల్‌ను తన తల్లితో కలిసి నిర్వహిస్తున్నాడు. పటాన్ చెరులోని ఇండస్ట్రియల్ ఏరియాలో గల స్పీడ్ డ్రై మిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బందికి నవీన్ ప్రతిరోజు టీ, టిఫిన్స్ సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో ఇదే కంపెనీలో గూడ్స్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ, పటాన్ చెరు మండలం ఇస్నాపూర్‌లో నివాసం ఉండే రాయిగల్ల శేఖర్(36)తో నవీన్‌కు స్నేహం ఏర్పడింది. శేఖర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో తరచూ నవీన్ డబ్బు సహాయం చేసేవాడు. నవీన్ అప్పుడప్పుడు శేఖర్ ఇంటికి వచ్చివెళ్లే క్రమంలో శేఖర్ భార్య ప్రమీల(27)తో నవీన్‌కు పరిచయం ఏర్పడింది. ప్రమీల స్థానికంగా హెల్పర్ పనిచేస్తుండగా, అక్కడికి సైతం నవీన్ వచ్చి వెళ్లేవాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రమీల ప్రస్తుతం 7నెలల గర్భిణి కాగా, శేఖర్‌కు ఉన్న ఆర్థిక ఇబ్బందులతో ప్రమీలను సక్రమంగా చూసుకోకపోవడంతో నవీన్ అన్ని చూసుకునే వాడు. ఈ మధ్య కాలంలో నవీన్, ప్రమీల సన్నిహితంగా ఉండడం శేఖర్ గమనించడంతో పాటు ఇద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగుతుందని గుర్తించాడు. దీంతో శేఖర్ తన భార్య ప్రమీలను కొట్టడంతో పాటు నవీన్‌కు వార్నింగ్ ఇచ్చాడు. ప్రమీలను సక్రమంగా చూసుకోకుండా తరచూ కొట్టడం, తమ అక్రమ సంబంధానికి శేఖర్ అడ్డువస్తున్నాడని భావించిన నవీన్ ఏలాగైనా శేఖర్ అడ్డుతొలగించుకోవాలని పథకం వేశాడు. దీంతో ఈ నెల 15వ తేదీన శేఖర్‌కు ఫోన్ చేసిన నవీన్ కలుద్దామని చెప్పాడు. పటాన్‌చెరు పరిధిలోని క్యాండిడస్ ఇంటర్నేషనల్ స్కూల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో ఇద్దరు కలుసుకొని మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇరువురు డబ్బులు విషయంలో గొడవ పెట్టుకున్నారు. ఈక్రమంలో అక్కడే ఉన్న ఓ బండరాయిని నవీన్ తీసుకొని శేఖర్ తలమీద బలంగా కొట్టాడు. దీంతో శేఖర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించిన నవీన్ కొద్దిదూరం లాక్కెళ్లి.. అక్కడ ఉన్న అట్టపెట్టెలను కప్పి దాచిపెట్టి వెళ్లిపోయాడు. అనంతరం శేఖర్‌ను హత్య చేసిన విషయాన్ని నవీన్ ప్రమీలకు ఫోన్ చేసి చెప్పాడు. కాగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు ఇస్నాపూర్‌కు చెందిన శేఖర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శేఖర్ హత్యపై భార్య ప్రమీలను వివరాలు అడుగగా, తనకేమీ తెలియదని పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసింది. పోలీసుల విచారణను ఎప్పటికప్పుడు ప్రమీల ఇంటి పక్క వారి ఫోన్ నుంచి నవీన్‌కు సమాచారం అందించసాగింది. ఈ విషయమై స్థానికులు ఇచ్చిన సమాచారంతో ప్రమీలను అనుమానించిన పోలీసులు నిలదీయగా అసలు విషయం చెప్పింది. దీంతో మృతుడి భార్య ప్రమీలతో పాటు ప్రియుడు నవీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

సైదాబాద్, మే 15 ప్రభాతవార్త: మొబైల్ ఫోన్ స్నాచింగ్, జేబు దొంగత నాలకు పాల్పడు తున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను కాంచన్‌బాగ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చంద్రాయణగుట్ట ఏసిపి సుధాకర్ శనివారంకాంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజుతో కలసి దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 15వ తేదీన డిఎంఆర్ఎల్ చౌరస్తా సమీపంలో సయ్యద్ నజీర్ అహ్మద్ మొబైల్ ఫోన్‌ను ద్విచక్రవాహనంపై వచ్చిన నిందితులు లాక్కుకుని పరారయ్యారు. నజీర్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మొబైల్ ఫోన్ స్నాచింగ్, జేబు దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర నేరస్తుల ముఠా చిక్కింది. నిందితులు అంబట నరేష్ అలియాస్ కావటి నరేష్, బానాల అరుణ్ కుమార్ అలియాస్ నాని, మేకల చిరంజీవి అలియాస్ చిరు, తోట సురి అలియాష్ సురేష్ అలియాస్ సూర్య, తోట చందు, సందీప్ జైస్వాల్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అంబట నరేష్‌పై జగద్గిరిగుట్ట, ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్లలో, బానాల అరుణ్‌పై అయిజా జోగులాంబ గద్వాల, భువనగిరిలలో, మేకల చిరంజీవిపై గూటి, నాగర్‌కర్నూలలలో, తోట సూరిపై ఆదిబట్ల, జూబ్లిహిల్స్‌లలో, తోట చందుపై చైతన్యపురి పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని నిందితులు మొబైల్ ఫోన్ల స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. దొంగిలించిన ఫోన్లను తెలిసిన వ్యక్తుల ద్వారా నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయించేవారు.

కొన్ని సార్లు ఫోన్లను విడిభాగా లుగా విభజించి మొబైల్ రిపేర్ దుకాణాలకు, డీలర్లకు తక్కువ ధరలకు అమ్మే వారు. నిందితుల నుండి 132 బ్యాటరీలు, మదర్‌బోర్డు లేని 172 ఫోన్లు, వివిధ ఫోన్ల 73 కెమెరా పార్ట్స్, 14 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌తకు తరలించారు.

నిమ్స్‌లో వైద్య సంరక్ష వృత్తి నిపుణుల వార్షిక వేడుకలు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్తః
నిమ్స్ లో వైద్య సంరక్ష వృత్తి నిపుణుల 34వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ నిమ్స్ అభివృద్ధిలో సమిష్టి కృషి ఉందన్నారు. వైద్యవిద్యా రంగంలో దేశంలో నిమ్స్ ప్రముక స్థానంలో ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని, చిన్నిచిన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షురాలు శాంతకుమారి మాట్లాడుతూ నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి ఎప్పుడు ముందుంటామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. మహేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగుల గ్రాట్యుటీ పెంపు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ఉద్యోగులు ఏ క్యాడర్లో జాయిన్ అయ్యారో అదే కేడర్‌లో రిటైర్ అవుతున్నారని, మూడు దశాబ్దాలుగా సేవలు చేసినా ఒక్క పదోన్నతి లేదని అన్నారు. ఈ అంశాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇచ్చిన పీజీ ఇంక్రిమెంట్ యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగులను అలరించాయి.

కేశవరావు కమిటీని రద్దు చేయాలి : ఉద్యమకారుల జెఎసి

అభివాదం తెలుపుతున్న జెఎసి నాయకులు

సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త:
తెలంగాణ ఉద్యమకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసిన కె.కెశవ రావు కమిటిని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కమిటీలో తెలంగాణ ఉద్యమకారులు లేరని, అంతా ప్రభుత్వ రంగానికి చెందిన వారేనని జెఏసి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలో ఉద్యమకారుల సంఘాల నుంచి సభ్యులుగా ఎవరిని నియమించలేదన్నారు. ఉద్యమకారుల సంఘాల నుంచి మరో 5 గురు సభ్యులను నియమించాలని, నిర్ణిత కాలంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలం, 25 వేలు పెన్షన్ సౌకర్యం, గుర్తింపు కార్డులు పంపిణి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళా రిజర్వేషన్ల అమలుపై సంతకాల సేకరణ

సంతకాలు చేసిన పోస్టు కార్డులను చూపుతున్న విజయారెడ్డి ఇతర కాంగ్రెస్ మహిళా నేతలు

జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్తః
మహిళా రిజర్వేషన్ బిల్లు 33 శాతంను వెంటనే అమలు చేయాలని ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్, టిపిసిసి కార్యదర్శి పి విజయారెడ్డి డిమాండ్ చేశారు. ఎర్రమంజిల్ డివిజన్ అధ్యక్షురాలు ఎల్లమ్మ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై శనివారం పోస్టుకార్డుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయారెడ్డి మాట్లాడుతూ మహిళా ఆరక్షన్ బిల్ ఆజ్ కరో, అబికరో అనే నినాదంతో పోస్టు కార్డులపై సంతకాలు చేయించి వాటిని ప్రధాని కార్యాలయానికి పోస్ట్ చేస్తామన్నారు. ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లావణ్య, మహిళా నాయకులు కమల, శ్రీదేవి, ఎల్లమ్మ, మాధురి,సంధ్యారాణి, మాధవి, భవాని,అనురాధ,పార్వతమ్మ పాల్గొన్నారు.

విజయ్ డెయిరీ మార్కెటింగ్ బృందంతో సమావేశం

సిబ్బందితో చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

తార్నాక, మే 16 ప్రభాతవార్త : లాలాపేటలోని తెలంగాణ విజయ డైరీ కార్యాలయంలో మార్కెటింగ్ బృందంతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై మార్కెటింగ్ కార్యకలాపాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని విజయ పార్లర్లు, విజయ బూత్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అలాగే విజయ డైరీ ఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి మార్కెటింగ్ బృందం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కోరారు. నాణ్యత, విశ్వసనీయతతో పాటు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విజయ డైరీ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి, డీజీఎం ప్రవీణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి హిందూ ధర్మం ఆత్మలాంటిది



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సునీత రామ్‌మోహన్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 16 ప్రభాతవార్త: వెస్ట్ మారేడ్‌పల్లిలోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో వెస్ట్‌మారేడ్‌పల్లి మండలం హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత సమాజిక సమరసత మహిళా కన్వీనర్ సునీత రామ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి హిందూ ధర్మం ఆత్మంటిదని, సమాజాన్ని చైతన్యవంతం చేసి దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్ష్యంతో ప్రతీ వ్యక్తి కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరిలో హిందూ సమాజం పట్ల గౌరవం, ఏకాత్మతా భావం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం అర్చకుడు వెంకట రమణాచార్యులు, సంభాగ్ ప్రచార ప్రముఖ్ నవీన్, మాజీ కార్పొరేటర్ కొంతం దీపికలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతో పాటు కళలు కూడా అవసరం

బేగంపేట మే 16,ప్రభాతవార్త
విద్యార్థులకు విద్యతో పాటు కళలు కూడా ఎంతో అవసరం అని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ అన్నారు. విద్యావారోత్స వాలలో భాగంగా బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సాంస్కృతిక విభాగం శనివారం కల్చరల్ అండ్ ఇన్నోవేషన్ డేని ఘనంగా నిర్వహించింది. మానవ మనుగడకు విద్యతో పాటు కళలు కూడా ఎంతో అవసరం అని ప్రిన్సిపాల్ అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ పాటతో అలరించారు. విద్యార్థులు, పాటలు,నృత్యాలు,కవితలు,కథలు,తదితర అంశాలలో నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కరరెడ్డిల చేతుల మీదుగా రూ 1000ల నగదు బహుమతిని అందించారు.సంప్రదాయ నృత్యంలో ఎన్. భార్గవి,జి.వైష్ణవి,ఏ.దివ్యలు ప్రదర్శించిన మహాభారత ఘట్టం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొఫెసర్ అప్పర్ ఉన్నిసా, డా.నాన్సీ సరేనా,డా.విజయ రాఘవి,డా.కాజాబీ, డా. శాంతికళ,డా.ప్రణీతలు పాటలను ఆలపించారు.బిజే గౌతమ్ మృదంగ విన్యాసం అలరించింది.పాల్గొన్న విద్యార్థులకు సాంస్కృతిక విభాగం మెమెంటోలు అందజేసింది.

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ.

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన విద్యావారోత్స వాల్లో మెరిసిన బేగంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు.రాష్ట్ర ప్రభుత్వం విద్యావారోత్స వాల్లో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థునులు ప్రతిభ చూపారు.ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా సత్కరించారు.సంప్రదాయ నృత్య విభాగం నుంచి బి.శ్రీవల్లి,సంప్రదాయ గాన విభాగం నుంచి అరభి అయ్యర్ ప్రశంసా పత్రాలు,ఒక్కొక్కరూ మూడువేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు.ప్రభుత్వ గుర్తింపు లభించడం తమకెంతో ఆనందం కల్గించిందని ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, అధ్యాపకులు అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వానికి ,ఉన్నత విద్యాశాఖ కమీషనర్ దేవసేన కి కృతజ్ఞతలు తెలియజేసారు.

ఉద్యమకారుల గౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : మోతే శోభన్ రెడ్డి

-ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

తార్నాక, మే 16 ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సాధనలో కీలక పాత్ర పోషించిన తొలి దశ, మలిదశ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు, గౌరవ పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే చర్యగా ఆయన అభినందించారు.శనివారం తార్నాక డివిజన్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి వారి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను

అధికారికంగా గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం ఉద్యమకారులకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది యువకులు ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు పోలీసు కేసులు, జైలు జీవితం, శారీరక–మానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలి

సైఫాబాద్, మే 16 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కె.కేశవ రావు ఆధ్వర్యంలో కమిటీని వేయడాన్ని తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆహ్వానించింది. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి, కె.కెశవరావును కలుస్తామని, ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతామని వేదిక తెలిపింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో వేదిక రాష్ట్ర ఛైర్మన్ నరాల సత్యనారాయణ మాట్లాడుతూ జూన్ 2వ తేదీలోగా ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతామని, నెలరోజుల్లోగా అమలు చేయకపోతే 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపట్టి ప్రాణాలను అర్పిస్తామన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం 250 గజాలతోపాటు నాలుగు గదుల ఇల్లు నిర్మించాలని, ప్రతి నెల 25 వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పది లక్షల బీమా సౌకర్యం, కుటుంబ సభ్యులకు ఆరోగ్యశ్రీ ద్వారా 25 లక్షల వరకు వర్తింప జేయాలని, బస్‌లు, రైలులో

సదస్సులో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, పిల్లలకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ ద్వారా ఉచితంగా విద్యను అందించాలని, అలాగే విద్యను అభ్యసించిన తరువాత ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, 10 వేల కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కెకె కమిటీలో నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని, ఎఫ్ఐఆర్ కేసులు అయినవారు, బైండోవర్ కేసులైనవారు, 2001 నుంచి 2014 వరకుక సీనియర ఉద్యమకారులను, 1969 ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని, అలాగే అమరుల కుటుంబాలను అదుకోవాలని కోరారు. ఈ సదస్సులో నాయకులు తోడేటి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆశాభోస్లే లతామంగేష్కర్‌లు విశ్వవిఖ్యాత గాయనీమణులు : రామచందర్‌రావు

రవీంద్రభారతి, మే 16 ప్రభాతవార్త : భారతదేశంలో ఆశాభోస్లే, లతామంగేష్కర్ ఇద్దరూ విశ్వవిఖ్యాత గాయనీమణులని, వారి పాటలు ఎంతో వినసొంపుగా ఉంటాయని, అయితే ఇప్పటి గాయకుల్లో ఎస్.పి.శైలజ అద్భుతమైన పాటలను వీనులవిందుగా సుమధురంగా ఆలపిస్తూ ఆలోను తీరుస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. నేడు సంగీతంలో కూడా ఎన్నో మార్పులొచ్చినా మన మూలాలను మాత్రం మరచిపోరాదని, భాకతీయ సంస్కృతి, సంగీత సాహిత్యాలు కళలు కాపాడుకుంటూ ప్రోత్స హించాలని హితవుపలికారు. విదేశాల్లో మన భారతీయ సంతతే కాకుండా అక్కడి కళాకారులు కూడా మన సంస్కృతి కళలు సంగీతంపట్ల ఎంతో మక్కువ చూపిస్తూ అభ్యసించి ఆనందిస్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణ పర్యాటక, భాషా సాంస్కృతికశాఖల సౌజన్యంతో ఆనందభైరవి సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంతర్జాతీయ గాయని శారదాసాయి నిర్వహణలో సంస్థ 14వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని ఆశాభోస్లేకు సినీ సంగీత విభావరితో ఘననివాళులర్పిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్.రామచందర్‌రావు ఆత్మీయ

ఎస్పీ శైలజను పురస్కారంగా సత్కరిస్తున్న ఎన్.రామచందర్‌రావు, శారదాసాయి, చంద్రశేఖర్, అశోక్, వెంకట్రావు తదితర అతిథులు

అతిథులు నంగునూరి చంద్రశేఖర్, బి.అశోక్, యుగంధర్, చక్రపాణి, డా. బంటి. వెంకటేశ్వరరావు, వడ్లకొండ వెంకట్రావు తదితరులతో ప్రముఖ నేపథ్యగాయని ఎస్.పి.శైలజను ఘనంగా సత్కరించి ఆనందభైరవి–ఆశాభోస్లే ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు సినీసంగీత విభావరిలో గాయని ఎస్.పి.శైలజ పలువురు వర్ధమాన గాయకులతో కలిసి ఆలపించి ఆణిముత్యాల్లాంటి సినీగీతాలు విచ్చేసి అశేష సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను సంగీతలోకంలో విహరింపజేశాయి.

నకిలీ వైద్యుడి అరెస్ట్

నిందితుడి వివరాలు తెలుపుతున్న పోలీసులు

సికింద్రాబాద్, మే 16 ప్రభాతవార్త:
ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఎలాంటి అర్హత లేకుండా అక్రమంగా ఇంజక్షన్లు ఇస్తున్న ఒక నకిలీ వైద్యుడిని వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారాసిగూడలో మాధవ మెడికల్ షాప్ పేరుతో సాగుతున్న ఈ అక్రమ ధందాను పోలీసులు చేదించారు.భూపాలపల్లికి చెందిన నన్నుట మాధవ్ (42) కొంతకాలంగా వారాసిగూడలో ఉంటున్నాడు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన నిందితుడికి ఎలాంటి వైద్య లేదా ఫార్మసీ అర్హతలు లేవు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో, కుంట అర్చన అనే స్నేహితురాలి డ్రగ్ లైసెన్స్‌ను అడ్డం పెట్టుకుని ప్రాక్టీస్ చేస్తున్నాడు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి, ముఫ్తీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌కు ఇంజక్షన్ ఇవ్వబోతుండగా నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాను గత ఏడాది కాలంగా రోగులకు వైద్యం చేస్తూ, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా డైక్లోఫినాక్, టీటీ వంటి ఇంజక్షన్లు ఇస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆ షాప్‌లో అక్రమంగా ఉంచిన ఇంజక్షన్ వైల్స్‌ను, వ్యాపారానికి ఉపయోగించే శామ్‌సంగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణికొండ డాలర్ హిల్స్‌లో తెగిపడ్డ లిఫ్ట్
ఆరుగురు బిఆర్ఎస్ నాయకులకు గాయాలు

హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త
మణికొండలోని డాలర్ హిల్స్‌లో శనివారం లిఫ్ట్ ప్రమాదం చోటుచేసుకుంది. ఒక అపార్ట్మెంట్లో లిఫ్ట్ వైర్లు ఒక్కసారిగా తెగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించడమే కాకుండా అపార్ట్మెంట్లోని నివాసితులను భయాందోళనకు గురిచేసింది.డాలర్ హిల్స్‌లోని ఒక అపార్ట్మెంట్ ఐదవ అంతస్తులో రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి చేయబోయే పాదయాత్ర కు సన్నాహక సమావేశం జరిగింది. ఈ మీటింగ్ ముగించుకుని ఆరుగురు నాయకులు గ్రౌండ్ ఫ్లోర్కు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కిందకు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తి, వైర్లు తెగిపోయాయి. దీంతో లిఫ్ట్ నేరుగా ఐదో అంతస్తు నుండి కిందకు కుప్పకూలిపోయింది. లోపల ఉన్న వారు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రమాదం జరిగిపోయింది.ఈ ప్రమాదంలో లిఫ్లో ఉన్న ఆరుగురు నాయకులకు గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి అత్యంత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. లిఫ్ట్ వేగంగా కిందకు పడటంతో ప్రభావం ఎక్కువగా ఉండి ఇద్దరి కాళ్లు విరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అపార్ట్మెంట్ వాసులు, ఇతర నాయకులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని అత్యవసర చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్‌ని అపోలో ఆసుపత్రికి తరలించారు.

సంప్రదాయ మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్

బేగంపేట మే 16,ప్రభాతవార్త
వినూత్న వంటకాల ఆధారిత పర్యాట కార్యక్రమాలు తెలంగాణా సంప్రదాయ ఆహార సంస్కృతిని పరిరక్షిస్తాయని తెలంగాణా టూరిజం అధికారులు అన్నారు.ముఖ్యంగా యువత ,పర్యాటకులకు సాంస్కృతిక అనుభూతిని అందిస్తాయని తెలిపారు.బేగంపేట లో తెలంగాణా టూరిజం ఆధ్వర్యంలో సంప్రదాయ మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్ ను నిర్వహించారు.తెలంగాణా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీటీడీసీ),తెలంగాణా ఛెఫ్స్ అసోసియేషన్ సహకారంతో ది ప్లాజా వేదికగా మామిడి కాయ పచ్చడి తయారీ వర్క్‌షాప్‌ను విజయ వంతంగా నిర్వహించింది.తెలంగాణా సంప్రదాయ వంటకాల వారసత్వాన్ని ప్రతిబింబించిన ఈ కార్యక్రమానికి గృహిణులు,ఆహార ప్రియులు, పర్యాటకులు,పాల్గొనే వారి నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమం టీజీటీడీసీ ఛైర్మన్ పాటిల్ రమేష్ రెడ్డి,యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్,టీజీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి,పర్యాటక శాఖ డైరెక్టర్ రంజీత్ నాయక్,సహకారంతో నిర్వహించారు. తెలంగాణా సంప్రదాయ వంటకాల సంస్కృతిని పునరుద్ధరించి,ప్రోత్సహించేందుకు తెలంగాణా టూరిజం తీసుకున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రముఖులు అభినందించారు.ముందుగా అతిధులు,ఛెఫ్స్ ,పర్యాటక శాఖ అధికారులు సమక్షంలో దీప

సంప్రదాయ మామిడి కాయ పచ్చడి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న టీజీటీడీసీ ఛైర్మన్ పాటిల్ రమేష్‌రెడ్డి.అధికారులు.ఛెఫ్ సంజయ్ తుమ్మా.

ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రముఖ సెలబ్రిటీ ఛెఫ్ సంజచ్ తుమ్మా సంప్రదాయ తెలంగాణా శైలిలో మామిడి కాయ పచ్చడి తయారీ విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శనగా చూపించారు.తర తరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పద్ధతులు,స్థానిక మామిడి కాయలు,మసాల దినుసులు,నిల్వ విధానాలపై ఆయన వివరించారు.ఈ వర్క్‌షాప్ కు తెలంగాణా ఛెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమేయ్ మరాఠే అసోసియేషన్ సభ్యులు పచ్చడి తయారీ చేస్తున్న వారికి మార్గదర్శనం చేసారు.సరైన మసాలా నిష్పత్తులు కలపడం, పరిశుభ్రత,నిల్వ విధానాలు వంటి అంశాలను తెలియజేసారు.పాల్గొన్న ప్రతి ఒక్కరూ వారు తయారు చేసుకున్న పచ్చడిని వారు ఇంటికి తీసికెళ్లే అవకాశాన్ని కల్పించారు.ఈ కార్యక్రమానికి పేరున్న కంపెనీలు తమ ఉత్పత్తులను అందజేసాయి.

అంబేద్కర్ వర్సిటీలో ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహావిష్కరణ

జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్తః
దూరవిద్య పితామహుడు, ప్రఖ్యాత విద్యావేత్త, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్, ఇగ్నో వ్యవస్థాపకులు ఆచార్య జి. రాం రెడ్డి విగ్రహాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి డా. బి. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆవిష్కరించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా వర్సిటీలో లీడర్షిప్ కనెక్ట్ కార్యక్రమం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఎస్టీడీ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ ఆర్వీఆర్ చంద్ర శేఖర్ రావు సినర్జీ హాల్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు ఆచార్య జి. హరగోపాల్ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాంరెడ్డి దూరవిద్య వ్యాప్తికి, అనేక ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు మూలకారకులు అని, ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఎప్పుడో పద్మ అవార్డు రావాల్సిందని, ఇప్పటికి అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పద్మ అవార్డుతో గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. న్యాక్ మాజీ డైరెక్టర్, డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రొ. రాంరెడ్డి దార్శనికతను కొనియాడారు. ఆచార్య చక్రపాణి మాట్లాడుతూ దూరవిద్య విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంతోపాటు అనేక సార్వత్రిక విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య హరగోపాల్, ఘంటా చక్రపాణి, వీఎస్ ప్రసాద్ తదితరులు.

మార్గదర్శిగా ఈ యూనివర్సిటీ నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొ. రాం రెడ్డి సతీమణి ప్రమీలారాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.యల్.విజయా కృష్ణారెడ్డి, ప్రొ. డి. నరసింహా రెడ్డి, విశ్వవిద్యాలయ అధ్యాపకులు ప్రొ.పల్లవి కబ్డే, ఓఎస్డీ ప్రొ.రవీంద్రనాథ్ సోలమన్, ప్రొ.పి. వెంకట రమణ, ప్రొ. రజని, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన మరియు భోదనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణలో బుక్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తపోటుపై ప్రజలు అవగాహన కలిగియుండాలి : డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషిరాబాద్, మే 16 ప్రభాతవార్త: రక్తపోటుపై ప్రజలలో అవగాహన పెంచడం, ఈ వ్యాధిని నివారించడానికి, నియంత్రించడానికి అన్ని దేశాల పౌరులను ప్రోత్సహించడమే ప్రపంచ రక్తపోటు దినోత్స వం ముఖ్యఉద్దేశమని ముషిరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపోటుపై ప్రజల్లో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటు వ్యాధికి దుమపానం చేయడం, ఎక్కువగా మద్యం సేవించడం, అధిక బరువు ఉండటం, శారిరక శ్రమలేకపోవడం, ఆహారంలో ఎక్కువగా ఉప్పు తీసుకోవడం మానసిక వత్తిడి వల్ల అధిక రక్తపోటు వస్తుందన్నారు. రక్తపోటు వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగియుండాలని సూచించారు. రోజు తీసుకునే ఆహారంలో ఉప్పు తక్కువగా ఉండటం, ఆహారంలో కొవ్వు పదార్ధాలు పరిమితి మించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్తపోటు విషయంలో ఎవరూ అశ్రద్ధ చేయకుండా ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాతీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ సూచించారు.

వయోధిక పాత్రికేయ సంఘం నూతన కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే 16,ప్రభాతవార్త:
వయోధిక పాత్రికేయ సంఘం నూతన కార్యదర్శిగా ఎన్. శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షులు దాసు కేశవ రావు అధ్యక్షతన జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న కొండా లక్ష్మణ రావు స్థానంలో శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారు. సంస్థ ఇరవై ఏళ్ళ క్రితం ఏర్పాటు అయినప్పటి నుంచి ఈస్థాయికి ఎదగడంలో సంస్థాపక అధ్యక్షులు వరదాచారితో కలిసి నిర్విరామంగా, అలుపెరుగని కృషి చేసిన లక్ష్మణ రావు శ్రమను ప్రశంసిస్తూ సమావేశం తీర్మానించింది. సంస్థ ఆర్ధిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ఆయన సొంత ఖర్చుతో కార్యకలాపాలను నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించారని కొనియాడింది. ఏ సంస్థ పురోగతి చెందాలన్నా లక్ష్మణరావు వంటి కష్టజీవుల అవసరం ఎంతైనా వుంటుందని వయోభారంతో సెలవు తీసుకుంటున్నట్టు ఆయన ప్రకటించి తప్పుకున్నారన్నారు. అయితే ముందు ముందు సంస్థ నిర్వహించే కార్యకలాపాలలో ఆయన సహాయ సహకారాలు అందించడానికి వీలుగా సంస్థ గౌరవ సలహా దారుగా వుండాలని సమావేశం ఆయనను అభ్యర్థించింది.

హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో జనగణన కార్యక్రమం



జనగణన కార్యక్రమంలో వివరాలు సేకరిస్తున్న దృశ్యం

పేట్ బషీరాబాద్, మే 16, ప్రభాతవార్త
కాలనీ వాసులందరూ సహకరించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన కార్యక్రమంలో పాల్గొనాలని అధికారులు కోరారు. శనివారం హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో జనగణన కార్యక్రమం నిర్వహించబడింది. ఎన్యుమరేటర్ సుధేష్ణ ఇంటింటికి వెళ్లి డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తూ ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, బృందావన్ కాలనీ మాజీ అధ్యక్షుడు పోగు సమ్మన్న, నేత సృజన్ కుమార్ పాల్గొన్నారు.జనగణన కార్యక్రమం 11-05-2026 నుండి 09-06-2026 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

మహాలక్ష్మి జ్యుయెలర్స్‌లో ఉద్యోగి చేతివాటం

జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్తః
జూబ్లీహిల్స్‌లోని మహాలక్ష్మి జువెలర్స్‌లో ఒక ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి బంగారు గొలుసు కాజేశాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లోని మహాలక్ష్మి జువెలర్స్‌లో మారుతి(19) ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. స్టోర్‌కు వచ్చిన కస్టమర్లకు బంగారు గొలుసులను చూపించే క్రమంలో పై అంతస్థు నుంచి కింది అంతస్థుకు లిఫ్టులో వస్తుండగా తన చూపాల్సిన రెండు బంగారు గొలుసుల్లోని ఒక గొలుసును జేబులో వేసుకున్నాడు. మరో గొలుసును కస్టమర్‌కు చూపించి నెమ్మదిగా షాపు నుంచి జారుకున్నాడు. అనంతరం అతని సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేశాడు. దీంతో స్టోర్ మేనేజర్ కమల లక్ష్మి నారాయణ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 35 గ్రాముల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈమేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లీలా హోటల్‌లో మరో సంఘటన..
బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌కు వచ్చిన ఒక చెన్నై వాసి బంగారు గొలుసు మాయమైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. చెన్నైకి చెందిన దేవదాస్ ఈ నెల 10న బంజారాహిల్స్‌లోని లీలా హోటల్‌కు వచ్చాడు. 11వ తేదిన స్నానానికి వెళ్లే సమయంలో తన మెడలోని దాదాపు 60 గ్రాముల బంగారు గొలుసును తీసి బల్ల మీద పెట్టి మరిచి పోయాడు. 12వ తేదిన గది ఖాళి చేసి చెన్నైకి వెళ్లాక గొలుసు సంగతి గుర్తుకొచ్చింది. దీంతో హోటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. గొలుసు లభించకపోవడంతో అతని మేనేజర్ ధర్మేంద్ర ద్వారా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంటపడుతున్నాడని 60 ఏళ్ల వృద్ధుడిపై ఫిర్యాదు

జూబ్లీహిల్స్, మే 16, ప్రభాతవార్తః
అరవై ఏళ్ల వృద్ధుడు పెళ్లి పేరుతో తన వెంటపడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఒక మహిళ(42) బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివసించే ఒక మహిళకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 1లో ఒక స్టోర్ ఉంది. కాగా ఇఫ్తికార్(60) అనే వ్యక్తి గత కొద్ది కాలంగా ఆమె వెంటపడుతున్నాడు. ఎన్నిమార్లు చెప్పినా అతను పద్దతి మార్చుకోకుండా ఆమెను పెళ్లి చేసుకుంటానని ఇబ్బంది పెడుతుండటంతో ఆమె షీ బృందాన్ని ఆశ్రయించింది. షీ బృందం సూచనల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో దోపిడికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

ఉప్పల్, మే 16 ప్రభాతవార్త : ఒక మహిళపై దాడి చేసి ఆమె వద్ద నుంచి నగదు, ఇతర వస్తువులు పాల్పడిన నిందితుడిని శనివారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా రమాదేవి(45) కర్మన్‌ఘాట్ వడ్డెర బస్తీలో నివాసం ఉంటుంది.అయితే ఈనెల 14వ తేదిన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్ వద్ద తన చిన్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి నిలబడి ఉండగా, ఒక గుర్తుతెలియని వ్యక్తి తన వద్దకు వచ్చి ఉప్పల్ లోని ఒక ఫార్మా కంపెనీలో చెట్లకు నీళ్ల పోయడం మరియు శుభ్రం చేసే పని ఉందని, ఒక గంట పని చేస్తే రూ.రెండు వేలు ఇస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మి అతనితో వెళ్లగా, అతను సమీపంలోని చెట్లు ఎక్కువగా ఉన్న నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఆమె గట్టిగా అరవడంతో ముఖం, మెడ, వెన్నుపై చేతులతో కొట్టి బెదిరించి, ఆమె వద్ద ఉన్న ఒప్పో సెల్ ఫోన్, రూ.4 వేల నగదు బలవంతంగా లాక్కొని అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపారు. పోలీసులు విచారణ చేయగా నిందితుడి ఉప్పల్ శాంతినగర్‌కు చెందిన దేశపాక లక్ష్మణ్ (22)గా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు బస్ స్టాప్‌లు, లేబర్ అడ్డాల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా ఎంచుకుని, ఉప్పల్‌లో నిఫార్మా కంపెనీలో చెట్లకు నీళ్ల పోయడం, శుభ్రం చేసే పని ఉందని చెప్పి, గంట పని చేస్తే రూ.2వేలు ఇస్తానని నమ్మించి వారిపై దాడులకు పాల్పడుతాడని తెలిపారు. నిందితుడు మద్యం సేవించడం వంటి చెడు అలవాట్లకు బానిసయ్యాడని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత 2022 సంవత్సరంలో ఎన్డీపీఎస్ కేసులో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జైలుకు వెళ్లివచ్చినట్లు తెలిపారు.ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీ : ఎమ్మెల్యే శ్రీగణేష్

మెరుగైన వైద్యానికి ఎల్.ఓ.సీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 16 ప్రభాతవార్త: కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సిఎం.ఆర్.ఎఫ్.ను సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సిఖ్ విలేజ్ పికెట్ ప్రాంతాలకు చెందిన అబ్దుల్ ఖాదిర్ అన్వర్, విశాల్‌లు నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల ఓల్ఓసీని శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు.

బోయిన్‌పల్లిలో అన్నదానం నిర్వహించిన జంపన

బోయిన్‌పల్లిలో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,మే 16 ప్రభాతవార్త: అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్,జయనగర్, చిన్నతోకట్ట ప్రాంతాల్లోని ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అమావాస్యను పురస్కరించుకొని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ పౌండేషన్ వ్యవస్థాపకులు నవ్రకాశ్ బాంటియా, ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ ముదిరాజ్,అజిత్ కళ్యాణ్,నర్సింహ్మా,శ్రీకాంత్,రామారావు, క్రిష్ణ, విఠల్ రావ్, సాయి, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి : కిషోర్ రెడ్డి

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న కిషోర్ రెడ్డి

దుండిగల్, మే 16, ప్రభాతవార్త

ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతీ ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బొంగునూరి కిషోర్ రెడ్డి సూచించారు. శనివారం దుండిగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డి. పోచంపల్లిలో తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. బౌరంపేట్ గ్రామానికి చెందిన సాయిరెడ్డిగారి సునీత ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, బాధిత కుటుంబ సభ్యులు బొంగునూరి కిషోర్ రెడ్డిని సంప్రదించారు. దీనికి వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60 వేల చెక్కును వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు బొంగునూరి కిషోర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

కేశవగిరి రామాలయంలో సంపూర్ణ నవగ్రహ హోమం

కేశవగిరి రామాలయంలో సంపూర్ణ నవగ్రహ హోమ పూర్ణాహుతిని నిర్వహిస్తున్న అర్చకస్వాములు

చాంద్రాయణగుట్ట, మే 16, ప్రభాతవార్త : అమావాస్యతో కూడిన శనివారం, శనైశ్చర స్వామి జయంతిని పురస్కరించుకొని పాతబస్తీ కేశవగిరి శ్రీ రామాలయంలో ఆ దేవస్థానం ప్రధాన అర్చకులు పరాంకుశం సుధీర్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులచే సామూహిక నవగ్రహ పూజను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం సంపూర్ణ నవగ్రహ హోమం, హనుమ హోమాలు జరిగాయి. ప్రధానార్చకులు సుధీర్ కుమారాచార్యులు భక్తులచే 1900 మార్లు యజ్ఞ భగవానుడికి స్వహాకారం చెప్పించారు. యజ్ఞంలో యజ్ఞ ద్రవ్యాలను, అవిస్సులను సమర్పించారు. ఆ తరువాత వేదమంత్రాలు, భక్తుల జేజేధ్వానాల మధ్య సంపూర్ణ నవగ్రహ పూర్ణాహుతి జరిగింది. భక్తులు ఆలయంలోని శ్రీ దుర్గామాతను, హనుమత్ సమేత శ్రీ సీతారామలక్ష్మణులను, స్వయంభుః ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆ తరువాత నవగ్రహాలను పూజించారు. శనైశ్చరనుని నల్లని నువ్వులు, వస్త్రం, నువ్వుల నూనెలతో ప్రత్యేకంగా అర్చించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజా కార్య క్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి ఎం.ప్రభాకర్ రాజ్ ముదిరాజ్, పాల్గొన్నారు.

నేడే మారేడ్‌పల్లిలో జాబ్ మేళా : సంతోష్ యాదవ్


జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సంతోష్ యాదవ్

అడ్డగుట్ట,మే 16 ప్రభాతవార్త: విద్యావంతులైన నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆదివారం మారేడ్‌పల్లి మల్టీపర్ పస్‌ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న విద్యావంతులైన నిరుద్యోగ యువతీ,యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ,బిపిఒ,హెల్త్‌కేర్, ఫార్మా,టెక్ మహేంద్ర,విప్రో, టెలి కాన్ఫరెన్స్,అపోలో వంటి ముఖ్య సంస్థల్లో పనిచేసేందుకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నట్లు అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆర్.డి.నాగేశ్‌యాదవ్,ఉమా శంకర్‌లు పాల్గొన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ బలోపేతంపై సమీక్ష సమావేశం

నిజాంపేట్, మే 16, ప్రభాతవార్త

మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నియమితులైన కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. అదేవిధంగా ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో కోఆర్డినేటర్లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశామని పేర్కొన్నారు. అలాగే వివిధ నియోజకవర్గాల్లో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా కాంగ్రెస్ నాయకులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు.బూత్ లెవల్

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఏజెంట్ (బీఎల్ఏ) నియామక ప్రక్రియను వేగవంతం చేసి జాబితాలను త్వరగా పీసీసీకి అందజేయాలని నాయకులకు సూచించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, కోఆర్డినేటర్లు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సత్యం మేడిపల్లి, కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జులు ఒడితల ప్రణవ్, కేకే మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు అంజన్ కుమార్, కోఆర్డినేటర్లు బొమ్మ శ్రీరాం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, సౌజన్య గౌడ్, దూడెం వెంకటరమణ, ఫక్రుద్దీన్, రాజ్ దేఖపాటి తదితరులు పాల్గొన్నారు.

రచనల్లో మహిళలు అందెవేసిన చెయ్యి : ప్రభుత్వ పూర్వ సలహాదారు రమణాచారి

రవీంద్రభారతి, మే 16 ప్రభాతవార్త : మహిళామణుల రచనలు వాస్తవాలకు, సమాజంలో జరిగే పరిణామాలకు, కుటుంబ వ్యవస్థ దగ్గరగా సమాజానికి గొప్ప సందేశాత్మకంగా ఉంటున్నాయని, ఎంతైనా రచనల్లో మహిళలది అందెవేసిన చెయ్యి అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, లేఖిని రచయిత్రుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో డా. వల్లీశ్వర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. ముక్తేవి భారతి, కళాబ్రహ్మ డా. వంశీరామరాజు, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి, రత్నశ్రీ, వెంకట్ తదితరులతో కలిసి డా. సి.భవానీదేవికి యద్దనపూడి సులోచనారాణి పురస్కారం; పొత్తూరి విజయలక్ష్మికి డా. వాసాప్రభావతి పురస్కారం; స్ఫూర్తి కందివనంకు డా. జి.పరిమళా సోమేశ్వర్ పురస్కారం; రాజా వాసిరెడ్డి మల్లీశ్వరికి పోలాప్రగడ

పురస్కార గ్రహీతలతో రమణాచారి, వల్లీశ్వర్, విజయలక్ష్మి, వంశీరామరాజు, శంకరనారాయణ తదితర అతిథులు

రాజ్యలక్ష్మి పురస్కారం; ముళ్ళపూడి శ్రీదేవికి డా. తెన్నేటి సుధాదేవి పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా పంచరత్నాలు లేఖిని పురస్కారాలు, అత్తలూరి విజయలక్ష్మి రచించిన ఒక హృదయం మీటితే కవితా సంపుటిని ఆవిష్కరింపజేశారు. సభకుముందు అత్తలూరి విజయలక్ష్మి రచించిన రచయిత్రి లఘునాటిక; మారెళ్ళ సావిత్రి ద్రౌపది ఏకపాత్రాభినయం ఆహుతులను ఎంతగానో అబ్బురపరిచి ఆకట్టుకున్నాయి.

ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలి

శిబిరంలో వైద్య పరీక్షలు జరిపించుకుంటున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

చాంద్రాయణగుట్ట, మే 16, ప్రభాతవార్త : ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని, సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు కోరారు. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, అలియాబాద్ గంగపుత్ర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు తరచూ నిర్వహించాలని సూచించారు. వైద్యం ఖరీదైన తరుణంలో ఉచిత శిబిరాలు పేదలకు మేలు చేస్తాయన్నారు. కిమ్స్ డాక్టర్లు 150 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్ ఒంటినొప్పులు ఉన్న వారికి వ్యాయామ ప్రక్రియలను తెలియజేశారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా మహిళలకు రక్తంలోని హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలను అందించారు. జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, అలియాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆనందేశి విజయానంద్, ప్రధాన కార్యదర్శి పల్లెల పురుషోత్తం, సహా కార్యదర్శి ఆనందేశి ప్రవీణ్ కుమార్, గోపాల్, కాంగ్రెస్ నేతలు శైలేందర్, ఇబ్రహీం, బాను యాదవ్, జనహిత క్యాంపు కో ఆర్డినేటర్ బి.నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ బూత్ స్థాయి అధ్యక్షుల శిక్షణ శిబిరం

సంజీవరెడ్డి నగర్, మే 16, ప్రభాతవార్త: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్), ఓటరు నమోదు ప్రక్రియపై బూత్ స్థాయి అధ్యక్షుల శిక్షణ శిబిరంలో శనివారం అమీర్‌పేట్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, హైదరాబాద్ ఇంచార్జ్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు, మ్యాపింగ్ ప్రక్రియ, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి, డివిజన్ అధ్యక్షుడు ఎం. హనుమంతరావు, డి. ప్రవీణ్ రెడ్డి, మల్లేష్ గౌడ్, కట్ట బలరాం, కూతురు నరసింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కంటోన్మెంట్,మే 16 ప్రభాతవార్త: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కార్ఖాన పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో నివాసం ఉంటున్న రాజ్‌కుమార్ (50) వృత్తిరీత్యా ఎలక్ట్రీషన్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో అతిగా మద్యం సేవించి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్‌గా వెంకట రాములు బాధ్యతల స్వీకరణ

జీడిమెట్ల, మే 16, ప్రభాతవార్త

గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్‌గా యు. వెంకట రాములు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో సమావేశమై సర్కిల్ పరిధిలోని పరిపాలన, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పశువుల రవాణాదారులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంజీవరెడ్డి నగర్, మే 16, ప్రభాతవార్త: సనత్‌నగర్ ఇన్స్పెక్టర్ డి. అశోక్ ఆధ్వర్యంలో శనివారం బాబ్బుగూడ పశువుల మార్కెట్‌లో జేబీ జోన్ డీసీపీ, ఏఎంసీ చైర్మన్, కార్యదర్శి, వెటర్నరీ అధికారులతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పశువుల రవాణాదారులకు పశువులను చట్టబద్ధంగా ఎలా రవాణా చేయాలి, గోవధ నిషేధ చట్టం, జంతు హింస నిరోధక చట్టాలపై వివరించారు. అలాగే వాహన డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన సమయంలో పోలీసుల సహాయం పొందే విధానంపై సూచనలు చేశారు.బక్రీద్ సందర్భంగా పశువులను మార్కెట్‌కు తీసుకురావడం, తుది గమ్యస్థానాలకు తరలించడం, అవసరమైన పత్రాలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్సార్ నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, సనత్ నగర్ ఇన్స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు : దీపాంకర్ పాల్

బాలికలకు పండ్లు పంపిణీ చేస్తున్న తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్

పాల్‌చార్మినార్,మే 16 ప్రభాతవార్త : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ అన్నారు. పాతబస్తీ దూద్‌బౌలి ఆశ్రిత హోంలోని బాలికలకు సమితి తరుపున శనివారంపండ్లు,నోట్ పుస్తకాలు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు.కార్యక్రమంలో బబ్లూ,మానస పాల్గొన్నారు.

జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలపై హర్షం

హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త

ప్రజాస్వామ్యంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు అవసరం అని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరపాలని నిర్ణయించి, ఎన్నికల తేదీలను ప్రకటించడం పట్ల ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేసారు.దీర్ఘకాలికంగా పెండింగ్‌లోఉన్న జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరపాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి, ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి జి.సంజీవరెడ్డిను శనివారం డిడికాలనీలోని ఆయన నివాసంలో మొగుళ్ళ రాజిరెడ్డి తోపాటు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జి.సంజీవ రెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గం యొక్క గొంతుకు యథార్థమైన ప్రాతినిధ్యం లభించేలా చేసే కార్మిక సంఘాలు అసమానతలను తగ్గించి, మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి సహాయపడతాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు అవసరమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు

ఐఎన్‌టియుసి అధ్యక్షుడు సంజీవరెడ్డిని సన్మానిస్తున్న జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి తదితరులు

నిర్వహించేలా ఒప్పించానని అన్నారు. ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ఈ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో విజయం కోసం కార్మికులందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిష్కారం కానీ జలమండలి కార్మికుల అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ను రాబోయే జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో కార్మికులు భారీ మెజారిటీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం.రాజా, నాయకులూ వినోద్‌గౌడ్, ఇందూరి తిరుపతి, శ్రీనివాస్, బి.మహేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మంచినీటిని తెచ్చిన ఘనత ప్రకాశ్‌గౌడ్‌దే

- మాజీ మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, మే 16 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంకు మంచినీటిని తెచ్చిన ఘనత ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌దేనని బండ్లగూడ జాగీర్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులపై విరుచుకుపడ్డారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని నా దృష్టికి తీసుకు రావాలని ప్రజా నాయకుడైన ప్రకాశ్‌గౌడ్ మామ్మల్ని ఆదేశించారని, ఆ మేరకు మేము ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులను దూరం చేస్తున్నామన్నారు. పాత గ్రామాలలో రోజు విడిచి రోజు, కాలనీల్లో మూడు రోజులకు ఒక మారు మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో వేగంగా స్పందిస్తుండడం వల్లనే ఈ ప్రాంత ప్రజలు వరుసగా నాలుగు సార్లు ప్రకాశ్ గౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం కేవలం ౭ఈ ప్రాంత ప్రజలకు తాగునీటిని తీసుకువచ్చేందుకే పార్టీ మారి, ప్రజలకు మంచినీటిని తాగించారన్నారు. ఇప్పుడు ఎక్కడా మంచినీటికి ఇబ్బందులు లేకున్నా కొందరు స్థానికేతరులైన బిఆర్ఎస్ నాయకులు వచ్చి నీటి

బండ్లగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

ఇబ్బందులంటూ పాదయాత్రల పేరుతో స్టంట్లు చేస్తుండడం సిగ్గు చేటన్నారు. పబ్లిసిటీ స్టంట్లు మానుకొని ప్రజల మధ్యనకు వెళితే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని సూచించారు. దశాబ్దాల పాటు ఈ ప్రాంతంలో ప్రజా ప్రతినిధిగా కొనసాగినా మంచినీటిని సరఫరా చేయించలేని కొందరు నేతలు ఇప్పుడు వాక్ ఫర్ వాటర్ పేరుతో స్టంట్లు చేయడంను ఈ గడ్డ ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఈ నేతలకు గుణపాఠం చెప్పి తీరుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లలితగీతాలు మానసిక ఉల్లాసం ప్రశాంతతను ఇస్తాయి : బండారు దత్తాత్రేయ

నాంపల్లి, మే 16 ప్రభాతవార్త : మాటలకన్నా పాటలు సమాజాన్ని చైతన్యపరుస్తూ మనిషిలో ప్రేరణ కలిగిస్తాయని, పాటిచ్చే సందేశం జీవితాంతం మరచిపోలేమని, అందులో లలితగీతాల్లోని మాధుర్యం, లాలిత్యం, భావం, కలిగే ఆనందం మానసిక ఉల్లాసంతోపాటు మనస్సుకు ప్రశాంతతను చేకూర్చి తన్మయుల్ని చేస్తాయని హరియాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. రసమయి సంస్థ 58 ఏళ్లుగా సంగీత సాహిత్య నృత్య కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహించి ప్రోత్సహించడం హర్షదాయకం, అనితరసాధ్యమని సంస్థ అధ్యక్షుడు డా. ఎం.కె.రామును గొప్ప ప్రజ్ఞాశీలి అని కొనియాడారు. డా. ఎం.కె.రాము రచించిన వేలాది లలితగీతాల నుండి ఎంపికచేసిన 216 విలక్షణ గీతాలను ప్రముఖ సంగీత దర్శకులు స్వరపరచిన గేయాలను 50మంది గాయనీగాయకులు, 50మంది వాయిద్య కళాకారులచే లలితసంగీతానికి పట్టాభిషేకం చేయడం హర్షదాయకమన్నారు. ప్రముఖ సాంస్కృతిక సాహితీ సంస్థ రసమయి ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రెండురోజులపాటు ఉదయం 9నుండి రాత్రి 9గంటల వరకు నిర్విరామంగా కొనసాగుతున్న ప్రముఖ కవి, లలితగేయ కళానిధి, రసమయి అధ్యక్షుడు బాలబంధు డా. ఎం.కె.రాము రచించిన 216 లలితగీతాలతో జరిగిన లలిత సంగీతానికి పట్టాభిషేకం కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బండారు దత్తాత్రేయ విశిష్ట అతిథులు

లలితగీతాలకు పట్టాభిషేకంను ప్రారంభిస్తున్న బండారుదత్తాత్రేయ, ఎం.కె.రాము, మేడసానిమోహన్, కె.రామాచారి, వాసురావు తదితర అతిథులు

పంచసహస్రావధాని డా. మేడసాని మోహన్, వి.వి.రాజగోపాల్, రచయిత బిక్కికృష్ణ, సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు, పి.శ్రీనివాసరావు, బింగి నరేందర్‌గౌడ్, గాయకుడు సంగీత దర్శకుడు కె.రామాచారి, సంస్థ అధ్యక్షుడు డా. ఎం.కె.రాము తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా లలితకళల ప్రాశస్త్యాన్ని, ప్రాముఖ్యతను యువతరానికి అందజేయడం శ్లాఘనీయం అన్నారు. ఇవి ప్రాశ్చాత్య ప్రభావాన్ని తగ్గించడానికి, భారతీయతను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఎంతగానో దోహదపడతాయని స్పష్టంచేస్తూ ఎం.కె.రాముకు ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈనాటి 12గంటల నిర్విరామ లలితగీతాలకు పట్టాభిషేకంలో గాయకులు తమ మధురకంఠంతో 108పాటలు గానం చేసి ఆహుతులను సంగీతలోకంలో విహరింపజేశారు.

పేదలను ఆదుకోవటానికి ముందుకు రావాలి : రజా అలీ మీర్జా

తెలంగాణ తాజ్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు రజా అలీకి మెమోంటోను అందజేస్తున్న యామ్‌షియా ఛానల్ చైర్మన్ హసీం అలీ మీర్జా

చార్మినార్,మే 16 ప్రభాతవార్త : పాతబస్తీలోని పేద ప్రజలకు సేవలు అందిస్తున్న తెలంగాణ తాజ్ మహిళా సంక్షేమసంఘం అధ్యక్షులు రజా అలీ మీర్జాని దారుషిఫాలో జరిగిన కార్యక్రమంలో యామ్ షియా ఛానల్ చైర్మన్ హసీం అలీ మీర్జా శాలువ కప్పి సత్కరించి మెమోంటోను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ తాజ్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు రజా అలీ మీర్జా మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవటానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని తెలిపారు. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు శ్రీ లక్ష్మీనారాయణుల వసంతోత్సవం

చాంద్రాయణగుట్ట, మే 16, ప్రభాతవార్త :

పాతబస్తీ గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని బతుకమ్మ బావి వద్ద గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, శ్రీ రాజరాజేశ్వరీ దేవస్థానంలో ఈనెల 17వ తేదీ ఆదివారం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎం.వి. శేషాద్రి అయ్యంగార్ తెలిపారు. ఉదయం 8గం టలకు ఆరాధన, బాలభోగం, 9గంటలకు కుంభాభిషేకం (108 కళశాలతో), వసంతోత్సవం, 11 గంటలకు చక్రస్నానం, మధ్యాహ్నం 12.30 గంటలకు పుష్పార్చన, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని కోరారు.

26న జలవిహార్‌లో ముదిరాజ్ 'సింహావలోకనం' సదస్సు

సదస్సుపోస్టర్ ఆవిష్కరిస్తున్న దినేష్‌కుమార్, కిరణ్, కృష్ణకిశోర్, కిరణ్‌కుమార్, నాగరాజు తదితరులు

హైదరాబాద్,మే 16,ప్రభాతవార్త:

ముదిరాజ్ విద్యావంతుల వేదిక అద్వర్యంలో ఈ నెల 26న నగరంలోని జలవిహార్‌లో ముదిరాజ్ సింహావలోకనం సదస్సును నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షులు దినేష్‌కుమార్ ముదిరాజ్ తెలిపారు.శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సదస్సుకు సంబందించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాటాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వెనుకబాటుకు గల కారణాలు, అభివృద్ధి చెందేందుకు తీసుకోవల్సిన చర్యలపై సమాలోచన చేసేందుకు ఈసదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధులుగా మంత్రి వాకిటి శ్రీధర్, ఎంపీ ఈటెల రాజేందర్, మండలి డిప్యూటి చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సామాజిక విశ్లేషకులు ప్రొ. కంచె ఐలయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కావున ఈసదస్సును విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని ముదిరాజ్ కుల వైద్యులు, న్యాయవాదులు, విద్యావంతులు హాజారు కావాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ విద్యావంతుల వేదిక నాయకులు డా. కిరణ్ ముదిరాజ్, కృష్ణ కిషోర్ ముదిరాజ్, పూల నాగరాజు ముదిరాజ్, పిట్టల కిరణ్‌కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు : కిషోర్ రెడ్డి

దుండిగల్, మే 16, ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా బికేఆర్ ఫౌం డేషన్ వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని బొంగునూరి కిషోర్ రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 278వ డివిజన్ గాజుల రామారం, సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నిర్వహించిన 39వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్, బికేఆర్ ఫౌండే షన్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిం చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అహ్మద్, షేక్ సల్మాన్, మహమ్మద్ షఫీ, మహమ్మద్ మోహిన్, కావాలి గణేష్, గంట శివారె డ్డి, పృథ్వీ, దేవేందర్ రెడ్డి, కిష్టారెడ్డి, బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్
నిట్ నం. 17/HD/EE-I MALKAJGIRI-I/MKJZ/MMC/26-27, తేది: 16.05.2026
పని పేరు: కామీర్‌పేట తటాకం వద్ద అభివృద్ధి పనులు & సుందరీకరణకు కన్సల్టెంట్ ఏర్పాటు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): కన్సల్టెంట్ ఫీజు కోట్ చేయవలెను. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 17.05.2026 ఉ.11.00 గం. 20.05.2026 ఉ.11.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9154796465, 7995009098. తదుపరి వివరాల కొరకు @http://www.tender.telangana.gov.in ప్రొక్యూర్‌మెంట్ వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, MMC
DIPR.No.2514-PP/CL/Advt/1/2026-27, తేది: 16.05.2026

శని త్రయోదశి సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూజలు

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దంపతులు

సైదాబాద్, మే 15 ప్రభాతవార్త: శని త్రయోదశి సందర్భంగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మధుసాగర్, మల్లేష్‌గౌడ్, అభినవ్ సాగర్, అర్చకులు శంకరశర్మ, అంబాప్రసాద్, చంద్రకాంత్ శర్మ, ముత్యాల శర్మ, శ్రవణ్, ప్రవీణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఓబిసి మోర్చా సెక్రటరీగా రమణ్ సింగ్

సైదాబాద్, మే 15 ప్రభాతవార్త: మలక్‌పేట నియోజవర్గానికి చెందిన పితాంబర్ రమణ్ సింగ్ బిజెపి ఓబిసి మోర్చా ఆఫీస్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరు పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రమణ్‌సింగ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం చేపట్టే అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి సెక్రటరీగా నియమించిన పార్టీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం

అన్నదానం చేస్తున్న భగవాన్, రవి ముదిరాజ్

సైదాబాద్, మే 15 ప్రభాతవార్త: అమావాస్య సందర్భంగా శ్రీ మాత అన్నపూరేశ్వశ్వరి అన్నప్రసాద వివరణ కమిటి చైర్మన్ దండేటి కార్ భగవత్ ఆధ్వర్యంలో చంపాపేటలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 37 నెలలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యూత్ వింగ్ ఎల్‌బినగర్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్, ఆడెళ్ల రాజు, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : డైరెక్టర్ మహమ్మద్ షకీల్

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ ను సన్మానిస్తున్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాహమ్మద్ షకీల్, పోచమ్మ దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, మే 16, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్, శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ ను వారు మర్యాదపూర్వ కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమావాస్య భోజనాల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

తుర్కయంజాల్ మే 16, ప్రభాతవార్త
ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో జై వాసవి మాత హనుమాన్ అమావాస్య భోజనాల సేవా సమితి ఆధ్వర్యంలో గత 20 నెలలుగా నిరంతరాయంగా ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ నెల అమావాస్య భోజనాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కే. వీరేష్ గుప్తా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు నరసింహ గుప్తా, మధుసూదన్ గుప్తా, మరియు దాచేపల్లి రాజగుప్త చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సహకారం అందించిన వాసవి క్లబ్ అధ్యక్షుడు అయినటువంటి రంగ రాజశేఖర్ వారు ప్రతి అమావాస్య భోజనాలకు తన వంతు సాయం, సహకారాలు అందిస్తూ భాగస్వాములవుతున్నారు. ఈ అమావాస్య భోజనాల కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్క దాతకు సేవా సమితి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దాతల ఉదారత, సహకారంతోనే ఈ మహత్కార్యం దిగ్విజయంగా ముందుకు సాగుతోందని వారు కొనియాడారు.

హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన కమిషనర్

మల్కాజిగిరి మే 16, ప్రభాతవార్త:
కమల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో జరుగుతున్న గృహ గణన హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని శనివారం మిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ లో స్వయంగా కలిసి క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియ సమగ్రంగా కచ్చితంగా వహించాలని సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో మొత్తం 4 వార్డులు ఉండగా, 281 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమం నిర్వహణకు 281 మంది ఎన్యూమరేటర్లు మరియు 39 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భముగా వినయకృష్ణ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రజలు అందరు తమ ఇంటి వద్దకు వస్తున్నారు ఏనుమరేటర్స్ కి సహకరించాలని ప్రజలని చెప్పటం జరిగినది...కార్యక్రమంలో 1. జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్ గారు, 2. డిప్యూటీ కమిషనర్ శ్రీమతి జకియా సుల్తానా గారు, 3. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీ నరసింహా రెడ్డి గారు. మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం

అర్హులైన పారిశ్రామిక వేత్తలకు రుణాలను అందజేస్తున్న బ్యాండ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, బ్యాంక్ ఈడి ఎం.వి మురళీ కృష్ణ తదితరులు

నాచారం, మే 16 ప్రభాతవార్త : ఎంఎస్ఎంఈల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, వ్యాపార విస్తరణకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాచారం పారిశ్రామిక వాడలో మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, బ్యాంకింగ్ రంగ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. మురళీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి యువతకు వేగవంతమైన, సులభతర రుణ సదుపాయాలు అందించేందుకు బ్యాంక్ కట్టుబడి ఉందని తెలిపారు. వ్యాపార రంగ అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ గౌరవ అతిథిగా పాల్గొని యువ పారిశ్రామికవేత్తలకు ప్రేరణాత్మక సందేశం అందించారు. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ అర్హత కలిగిన ఎంఎస్ఎంఈలకు సీజీటీఎంఎస్ఈ కింద కొలాటరల్ ఫ్రీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వ్యాపార టర్నోవర్ ఆధారంగా జీఎస్టీ లింక్డ్ ఫైనాన్సింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు ముద్ర రుణాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వస్తి వెంకటేష్, సీజీఎం. ఎం. పిచ్చయ్య, జీఎం అండ్ జోనల్ హెడ్ హైదరాబాద్ గజేంద్ర చౌహాన్, డీజీఎం అండ్ రీజినల్ హెడ్ హైదరాబాద్ దేవేంద్ర, డీజీఎం, సీఎఫ్‌బీ, ఎ.వి. రమణమూర్తి, డీజీఎం అండ్ డిప్యూటీ జోనల్ హెడ్ సి. ఎస్.ఎస్. రావు, జాయింట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బాలానగర్, ఎ. ప్రభాకర్, కమిషనర్, టీజీఐపీసీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండిఎ పరిధిలోని చెరువులను శుభ్రపరిచి సుందరీకరణ చేయాలి : సబితా ఇంద్రారెడ్డి

చందన చెరువులో గుర్రపు డెక్కను తొలగించే పనులను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త: హెచ్ఎండిఎ పరిధిలో నున్న అన్ని చెరువులను శుభ్రపరిచి సుందరీకరణ చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోనున్న జిల్లెలగూడ చందన చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హాజరైన ఆమె డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నాటి సిఎం కెసిఆర్ సారథ్యంలో చెరువుల సుందరీకరణకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల అవుతున్నా చెరువుల పరిరక్షణ, సుందరీకరణను విస్మరించిందని ఆమె విమర్శించారు. సర్కార్ నిర్లక్ష్యం ఫలితంగా హెచ్ఎండిఎ పరిధిలోని చెరువులు మురికి కూపాలుగా మారి చాలా వాటిల్లో గుర్రపు డెక్క నిండి ఉందని వెల్లడించారు. దోమల బెడదతో చెరువుల పరిసర ప్రాంతాల ప్రజలు నరకం చవి చూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు కళ్లు తెరిచి హెచ్ఎండిఎ పరిధిలోని చెరువులపై దృష్టి సారించి వాటిని శుభ్రం చేయించాలని ఆమె సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా సుందరీకరించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లార్డ్స్ బీరప్ప, వి.ధనలక్ష్మి రాజ్‌కుమార్, ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, సిద్దాల పెద్ద బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, జటావత్ శ్రీనివాస్ నాయక్, మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, సుర్వి లత శేఖర్‌గౌడ్, సిద్దాల భరత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వందలాదిమంది దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అభినందనీయం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాప్రాయం ఎంఆర్‌ఓ బైరెడ్డి రాజేష్ ,డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్నారెడ్డి కృష్ణారెడ్డి

కుషాయిగూడ ,మే 16, ప్రభాతవార్త
వందలాదిమంది దాహార్తి తీర్చేందుకు ఈసిఎల్ నడిబొడ్డున చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని కాప్ర మండల తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ వద్ద కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ కుషాయిగూడ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి డిస్టిక్ గవర్నర్ ఇన్నారెడ్డి కళ్లెం కృష్ణారెడ్డి కుషాయిగూడ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా, సభాధ్యక్షులు లయన్స్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి అధ్యక్షతన ముఖ్య అతిథిగా విచ్చేసిన కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ డిస్ట్రిక్ట్ 320 సి గవర్నర్ లయన్ ఇన్నారెడ్డి , గవర్నర్ ఎలెక్ట్ లయన్ కళ్లెం కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాటసారూ లతోపాటు బాధితుల దాహాన్ని తీర్చడానికి ఈసీఐఎల్ పోలీస్ స్టేషన్ వద్ద జనసంద్రం ఉన్నచోట చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఇటిలైజ్ క్లబ్లో కాప్రా ప్రెస్ క్లబ్ లో ప్రతినిత్యం ఏదో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయ చారి సేవలను డిస్టిక్ గవర్నర్లు ఎన్నారెడ్డి కృష్ణారెడ్డి తహసిల్దార్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సుధాకర్ రెడ్డి, సాయిలు, శ్రీనివాస్ విజయ్ సతీష్ కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మొదటి గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ మండా సురేష్ నాగన్న, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్ కోశాధికారి సురేష్ విజయ్ నర్సింగ్ గౌడ్ బాలరాజ్ రోజా రాణి ప్రసాద్లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ శేఖర్ రెడ్డి, కలయన్ మిట్టపల్లి విజయ్ గౌడ్ షేర్ మణమ్మ, వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : కిషన్

తుర్కయంజాల్ మే 16, ప్రభాతవార్త
కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం , సిఐటియు ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోనీ నాగార్జున సాగర్ రహదారి బ్రాహ్మణపల్లి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ మాట్లాడుతూ..ఇటీవల కాలంలో నాలుగు రాష్ట్రాలు ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల ముందు వరకు ఎలాంటి ధరలను పెంచబోమని నమ్మబలికిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ పైన మూడు రూపాయల పైచిలుకు ధరలు పెంచడం అంటే ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ పై పెంచిన ధరలను, ఎక్సైజ్ సుంకాలను వెంటనే తగ్గించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పడుతున్న భారాలను నివారించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అంబానీ అదానీలకు దేశ సంపదను కట్టడపెట్టడంతో పాటు, భారత విదేశాంగ విధానాన్ని అమెరికాకు తాకట్టు పెడుతుందని, వెంటనే అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ప్రతి ధరలకు అమెరికన్ సామ్రాజ్యవాదం, దేశీయ పెట్టుబడిదారులే ప్రధాన కారణమని అన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం తుర్కయంజాల్ నాయకులు పి శ్రీనివాసులు, ఐతరాజ్, కృష్ణ, బడుగు మాల్యాద్రి, మద్దెల యాదయ్య, సిఐటియు నాయకులు ఆటో డ్రైవర్లు గుడ్ల వినోద్ కుమార్, గుండ బాలరాజ్, బండ బీరప్ప, శ్రీనివాస్, నాగరాజు, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలి: సిపిఎం

బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ధరల పెంపుదలకు నిరసనగా బాలాపూర్ మండల పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పార్టీ నేతలు ప్ల కార్డులు ప్రదర్శించి ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాన్యులకు భారంగా మారిన పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం నాయకుడు గోరంకల నర్సింహ, బాలాపూర్ మండల నాయకులు దాసరి బాబు, సుంకోజు యాదగిరిచారి, మీర్‌పేట్ నాయకులు దాసరి నర్సింహ, లక్ష్మారెడ్డి, వెంకయ్య, బుర్హాన్, జాపాల జంగయ్య, కొండల్, వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీలో సంకల్ప్-ఫ్యూచర్‌టెక్ కార్యక్రమం

సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్ప్-ఫ్యూచర్‌టెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యారంగ నిపుణులు కృత్రిమ మేధస్సు విద్యా రంగంపై చూపుతున్న ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా విద్యా రంగంపై కలుగుగుతున్న ప్రభావాన్ని వివరించారు. భవిష్యత్ ఉపాధి అవకాశాలు, డిజిటల్ నైపుణ్యాలపై ఆవశ్యకతను వారు తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, కెరీర్ గైడ్‌లైన్స్ సెల్ కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.జ్యోతి లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులుగా చిటికెల కృష్ణయ్య

రామంతాపూర్, మే 16 ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిటికెల కృష్ణయ్య వంశరాజ్ నియమితులైయ్యారు. శనివారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారా నికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ సాధన లో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు నిమ్మల వీరన్న, బిఎస్ఎఫ్ సురేష్, రామంతపూర్ రజక సంఘం గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి రవి, రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాసాని బాలస్వామి వంశరాజ్, ప్రధాన కార్యదర్శి ఇరగజీవ తిరుపతయ్య వంశరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాయసం గోపాల్ వంశరాజ్, ఉపాధ్యక్షులు చిన్న, కృష్ణ, వెంకటయ్య, చందు, నరసింహ, కాశన్న, వేణు, రాము, బాలు, వీరస్వామి, మల్లేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త: విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీరామకృష్ణపురం డివిజన్ యాదవనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో జగిని ఎడ్యుకేషన్ ట్రస్ట్, వాసవి అన్నప్రసాద ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శనివారం మెమొంటోలు, మెడల్స్, సర్టిఫికేట్లతో ఉపేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. జగిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ జగిని రమేష్, జగిని సోమయ్య పాల్గొని విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తుకు మరిన్ని విజయాలు చేకూరాలని, అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి అన్నప్రసాద ట్రస్ట్ చైర్మన్ పొద్దుటూరు శ్రీనివాస్, ట్రస్ట్ అడ్వైజర్ తాడేపల్లి వెంకటేశం, చిగుళ్లపల్లి లోకేష్, నవీన్‌కుమార్, మనోహర్, సుధాకర్, డాక్టర్ రామకృష్ణ, మాజేటి శ్రీనివాస్, వేముల నారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సిటి స్కాన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతల తదితరులు.

వనస్థలిపురం మే16, ప్రభాతవార్త
వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో హాస్పిటల్ సూపరిటెంట్ నాగేందర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. గత ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సహకారంతో సిటి స్కాన్ పరికరం మన హాస్పిటల్ కి కేటాయించడం జరిగిందని అయిన ఇప్పటిదాకా రోగులకు సిటీ స్కాన్ అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవడం జరుగుతుంది కొంతమంది కాలనీవాసులు మా దృష్టికి ఈ సమస్యను తేవడం వలన వెంటనే సిటీ స్కాన్ పరికరాన్ని గర్భిణీ స్త్రీలకు మరియు రోగులకు అందుబాటులో త్వరగా తీగా తేవాలని అవసరమైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలో సిటీ స్కాన్ ని రోగులకు అందుబాటులో ఉంచాలని అధ్యక్షులు చింతల రవికుమార్ తెలిపారు. హాస్పిటల్ సూపరిడెంట్ నాగేందర్ సానుకూలంగా స్పందించి వారంలోపు సిటీ స్కాన్ పరికరాన్ని అందుబాటులో తెస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కొలిశెట్టి సంజయ్ కుమార్ మరియు ఫేస్ ఫోర్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రావు ,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు లగోని శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆనంద్ రాజు , పార్దివాడ బస్తీ అధ్యక్షులు శక్తి కిషోర్ ,పరమేశ్వర్ గౌడ్ , విజయ్ ,కిషోర్ ,వంశీధర్ , ఇతర నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

కులషిత నీటి సరఫరాను వెంటనే పరిష్కరించాలి : బాణాల ప్రవీణ్‌కుమార్

జలమండలి డీజీఎంకు సమస్యను వివరిస్తున్న బాణాల ప్రవీణ్ తదితరులు

హైదరాబాద్ 15 మే, ప్రభాతవార్త :
డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీలో కలుషిత మంచినీటి సరఫరాలను వెంటనే పరిష్కరించాలని శనివారం రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు బాణాల ప్రవీణ్‌కుమార్ జలమండలి డిజీఎంను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత అరు నెలల నుండి కలుషితమైన నీరు సరఫరా అవుతున్న జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్య తో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని పేర్కొన్నారు. ప్రజల అరోగ్యంతో చెలగాటం అడొద్దని, ప్రజలు అనారోగ్యానికి గైతే అ భాద్యత జలమండలి అధికారులే వహించాల్సి ఉంటుందని అన్నారు. జలమండలి అధికారులు భాద్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఈ విషయాన్ని ఉన్నతాధితకారుల దృష్టికి తీసుకొనివెలుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ డివిజన్ అధ్యఓఉడు సిద్దు ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య ముదిరాజ్, ప్రెమ్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కాల బైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు

ఉప్పల్, మే 16 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని శ్రీ కాల బైరవస్వామి, శ్రీ బాల అంజనేయస్వామి ఆలయంలో శని జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా వద్ద శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో శని జయంతి సందర్భంగా ప్రత్యేక తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తులతో కలిసి శని దేవునికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మౌలాలి డివిజన్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

మల్కాజ్‌గిరి మే 16, ప్రభాతవార్త
మల్కాజ్‌గిరి మండల పరిధిలోని మౌలాలిలో డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. మౌలాలి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ఖి ఏర్పాటు సాధనే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశానికి ఎం.వి. ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎ వి ఎమ్ స్వామి హాజరై మాట్లాడుతు..ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో తగ్గుతున్న నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన సిఫారసులను 2026-27 విద్యా సంవత్సరం నుండే పక్కాగా అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీ గా 2,000 పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చాలని ప్రతి పాఠశాలలో కనీసం 1,500 మంది విద్యార్థులు చదువుకునేలా మౌలిక వసతులు కల్పించాలి. మౌలాలిలో సుమారు 50 వేల జనాభా ఉన్నప్పటికీ, కేవలం ఒక ఉన్నత పాఠశాల, 7 ప్రాథమిక పాఠశాలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో, పేద తల్లిదండ్రులు గత్యంతరం లేక ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్, బాలలల బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, మద్దురి దుర్గేశ్ . విజయ్ తల్లు సంఘం రాధ బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రషీద్ , రుబినా బేగం,ఎం వి ఫౌండేషన్ ఆర్గనైజర్స్ లు లావాన్య, సువర్ల , లావాన్య , సౌజన్య మొదలగువారు. పాల్గొన్నారు.

రూ.37.5 కోట్లతో సుందరీకరణ పనులకు ఏర్పాట్లు

పనులను పరిశీలిస్తున్న సాయిజన్ శేఖర్

నాచారం, మే 16 ప్రభాతవార్త : హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కృషితో రూ.37.5 కోట్ల వ్యయంతో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఈ పనులకు ముందస్తుగా చెరువులోని నీటిని తొలగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువులోని నీటిని నేరుగా ఉప్పల్ నల్లచెరువుకు మళ్లించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాబా నగర్ ఎస్‌టీపీ నుంచి ఉప్పల్ నల్లచెరువు బయటి వరకు ఉన్న ట్రంక్ లైన్ హెచ్‌ఎంటి నగర్ రైతు బజార్ పక్కన ఉన్న నాలా మార్గంలో వెళ్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో నాలాలోని ఒక మ్యాన్ హోల్‌కు రంధ్రం చేసి, పటేల్‌కుంట చెరువు నుంచి వస్తున్న మురుగునీరు హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువులోకి చేరకుండా ట్రంక్ లైన్ ద్వారా ఉప్పల్ నల్లచెరువు బయటకు మళ్లించే పనులు ఈరోజు చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్యలతో మరో వారంలో హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు పూర్తిగా నీటిలేకుండా ఖాళీ అవుతుందని సాయిజెన్ శేఖర్ వెల్లడించారు. చెరువు సుంద రీకరణ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన వాతావ రణం, అందమైన పరిసరాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం యాదగిరి పాల్గొన్నారు.

బిజెపి ఓబిసి కార్యదర్శిగా బత్తుల సుమన్‌గౌడ్

సుమన్‌గౌడును సన్మానిస్తున్న నాయకులు

ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త:
బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చైతన్యపురి డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు బత్తుల సుమన్‌గౌడ్ నియామకమయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చంద్రరావు ఆదేశాల మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల సుమన్‌గౌడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుమన్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకానికి అనుగుణంగా పార్టీ నియమనిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ సంక్షేమం అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేస్తానని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ పథకాల గురించి విస్తృత ప్రచారం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రాబోయే ఎన్నికలలో డబుల్ ఇంజన్ సర్కారు వచ్చే విధంగా ముమ్మర ప్రచారాన్ని చేపడతామన్నారు. క్రమశిక్షణ కలిగిన బీజేపీ సైనికుడిగా వచ్చే ఎన్నికల్లో గడప గడపకు బీజేపీ పార్టీని విజయానికి ముందు అడుగు వేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా సుమన్‌గౌడును చైతన్యపురి డివిజన్ బిజెపి నాయకులు పర్ల శివ, తిరుమల్ గౌడ్, కమల్, సత్యం, అర్జున్, భార్గవ్, ధనుష్, సందీప్, సూరజ్ తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న బ్రదర్ అరుణ్ ప్రకాష్, బ్రదర్ జాన్ తదితరులు

ఉప్పల్, మే 16 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల 11వ స్నాతకోత్సవ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల మాన్‌ఫోర్ట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ రెవ. బ్రదర్ అరుణ్ ప్రకాష్, డైరెక్టర్ రెవ. బ్రదర్ జాన్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిదిజగా డా.అనిల్ కుమార్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరేటరి అసోసియేట్ డైరెక్టర్ పాల్గొన్నారు. గౌరవ అతిథిగా ఒయు రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ జె.ఎల్.ఎన్.రావు తదితరులు హాజరయ్యారు. అనం తరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రేరణాత్మక సందేశాలు అందించారు. కళాశాల కోఆర్డినేటర్, హెచ్ఓడీలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవం తం చేశారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు తెలుపు రంగు దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.